## మాస్టారూ.. మీడియాకు చెప్తా..!


### గురువుకు చుక్కలు చూపిన శిష్యురాలు

### బ్లాక్‌మెయిల్ చేసి.. డబ్బులు గుంజిన విద్యార్థిని

### సుందర కాండలో క్రైమ్ స్టోరీ!



అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): చదువులకు సాయం చేసిన మాస్టారునే టార్గెట్ చేసింది ఓ విద్యార్థిని. తన ప్రియుడితో కలిసి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజడం ప్రారంభించింది. టార్చర్ భరించలేక మాస్టారు ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు అండగా నిలబడి పోలీసుల వద్దకు తీసుకెళ్లారు. వారు వలవేసి.. కన్నింగ్ స్టూడెంట్‌ను, ఆమె ప్రియుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగరంలోని ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్నాళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారం మంగళవారం క్లైమాక్స్‌కు చేరుకుంది.



బాధిత మాస్టారి స్నేహితులు తెలిపిన మేరకు, నగరంలోని ఓ కాలేజీలో చదివే విద్యార్థినికి ఓ లెక్చరర్ అండగా నిలిచారు. కొన్నేళ్ల నుంచి ఆర్థిక సాయం చేస్తున్నారు. బాగా చదువుకునేందుకు పలు సూచనలూ చేశారు. ఫీజు కట్టేందుకు ఇబ్బందిగా ఉంది అంటే.. ఇటీవల రూ.25 వేలు ఇచ్చారు. మాస్టారి ఉదారత గురించి తెలుసుకున్న ఆ విద్యార్థిని బాయ్ ఫ్రెండ్.. మరింత డబ్బు గుంజేందుకు ప్లాన్ చేశాడు. దీనికోసం సానుభూతి కోణాన్ని కాకుండా, బ్లాక్‌మెయిల్ చేయాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. ఆ లెక్చరర్‌కు ఫోన్ చేసిన విద్యార్థిని బాయ్‌ఫ్రెండ్.. 'అసభ్యంగా ప్రవరిస్తున్నారట.. వేధిస్తున్నారట..' అని బెదిరించాడు. తాను అలాంటివాడిని కాదని లెక్చరర్ వాపోతే.. విద్యార్థినిని కాన్ఫరెన్స్‌లోకి తీసుకుని, ప్లాన్ ప్రకారం ఆరోపణలు చేయించాడు. కాల్ రికార్డు చేశామని, మీడియాకు ఇస్తామని బెదిరించాడు. దీంతో లెక్చరర్ బెంబేలెత్తిపోయారు. ఇదే అదనుగా డబ్బులు గుంజడం ప్రారంభించారు. విడతలవారీగా సుమారు రూ.1.50 లక్ష లాగేశారు. ఇటీవల ఫోన్ చేసి రూ.1.50 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. తాను ఆసుపత్రి వద్ద ఉన్నానని, తన కుమారుడి ఆరోగ్యం బాగాలేదని, తనవద్ద అంత డబ్బు లేదని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో దిక్కుతోచని మాస్టారు ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు, తప్పు చేయనప్పుడు భయపడటం దేనికని.. పోలీసుల వద్దకు తీసుకెళ్లారు. నిజమేమిటో నిర్ధారించుకునేందుకు పోలీసులు ఓ సూచన చేశారు. 'అడిగిన డబ్బులు ఇస్తామని పిలవడం. డబ్బులు ఇవ్వండి. మేం వచ్చి పట్టుకుంటాం..' అని బాధితుడికి సూచించారు. మాస్టారు అలాగే చేశారు. మఫ్టీలో ఉన్న పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 'ఎందుకిలా చేశావ్..? సాయం చేసిన గురువుకే పంగ నామాలా..?' అని పోలీసులు నిలదీస్తే, 'సారు మీకు ఫిర్యాదు చేస్తారని ఎక్స్‌పెక్ట్ చేయలేదు సర్' అని అందట శిష్యురాలు. పోలీసులు విచారిస్తున్నారు. కానీ, జరిగిన సంఘటనను ధ్రువీకరించడం లేదు. గురువు క్షమించి వదిలేస్తారా..? లేక కిలాడీ శిష్యురాలు కాళ్లావేళ్లా పడి బయటపడతారా..? తేలాల్సి ఉంది.



కసాపురం వద్ద..

# స్వాగతం కృష్ణమ్మా..!

- జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే గుమ్మనూరు
- 3,850 క్యూసెక్కుల ప్రవాహమే టార్గెట్
- ఈ ఏడాది 40 టీఎంసీలు దాటే అవకాశం
- వారం తరువాతే సాగుకు విడుదల

## జిల్లాలోకి ప్రవేశించిన హంద్రీనీవా నీరు

గుంతకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో ఎత్తిపోతలు మొదలయ్యాక ఐదు రోజులకు.. మంగళవారం ఉదయం కృష్ణా జలాలు జిల్లాకు చేరాయి. మల్యాల పంప్‌హౌస్ వద్ద ఈ నెల 17న సీఎం చంద్రబాబు ఎత్తిపోతలను ప్రారంభించారు. కాలువ విస్తరణ పనులు పూర్తయ్యాక తొలిసారి నీరు పారుతోంది. ఈ కారణంగా తక్కువ మోతాదులో నీటిని ఎత్తిపోస్తున్నారు. కర్నూలు జిల్లా మద్దికెరను దాటుకుని బుగ్గసంగాల వద్ద కృష్ణా జలాలు జిల్లాలోకి ప్రవేశించాయి. త్వరలో మరిన్ని పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసి, లక్ష్యాన్ని సాధించాలని జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు కృత నిశ్చయంతో ఉన్నారు.

### 40 టీఎంసీలు దాటేలా..

హంద్రీనీవాలో 40 టీఎంసీల వరద నీటిని ఎత్తిపోయాలన్న లక్ష్యంతో కాలువను డిజైన్ చేశారు. ఎత్తిపోతలు ప్రారంభమయ్యాక మ్యాజిక్ ఫిగర్ 40 టీఎంసీలు టీడీపీ హయాంలో ఒకసారి, 2020-21 సీజన్‌లో ఒకసారి సాధ్యమైంది. వైసీపీ హయాంలో మిగతా నాలుగు సీజన్‌లలో సాగునీటి పారుదల అత్యంత దయనీయంగా జరిగింది. ప్రస్తుతం హంద్రీనీవా వైడెనింగ్ పూర్తయినందున ఈ సంవత్సరం 40 టీఎంసీలకు మించి సాగునీటిని కాలువలో పారించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఈ సంవత్సరం అత్యధిక రోజులపాటు కాలువలో నీటిని పారిస్తే.. 40 టీఎంసీల (మిగతా 6లో..)

### 3,850 క్యూసెక్కులే టార్గెట్

హంద్రీనీవా కాలువ సామర్థ్యానికి అనుగుణంగా మొదటి పంప్ హౌస్ వద్ద గరిష్ఠంగా 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో మల్యాల పంప్‌హౌస్ వద్ద ప్రస్తుతం 4 పంపులను రన్ చేస్తున్నారు. జిల్లాకు సమీపంలో, కర్నూలు జిల్లాలో ఉన్న గుండ్లకొండ 7వ నంబరు పంప్‌హౌస్‌లో 2 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో జిల్లాలోకి ప్రస్తుతం 320 క్యూసెక్కుల నీరు ప్రవేశించింది. రాగులపాడు వద్ద 8వ పంప్ హౌస్‌కు మంగళవారం అర్ధరాత్రికి నీరు చేరుకుంటుంది. అక్కడి నుంచి జీడిపల్లి రిజర్వాయరు వైపు నీటిని ఎత్తిపోస్తారు. కాలువ గట్ల పరిస్థితిని అంచనా వేయడానికి తక్కువ మోతాదులో నీటిని పారిస్తున్నారు. విడతలవారీగా పంపుల సంఖ్యను పెంచుతూపోతారు. పదిహేను రోజుల్లోగా జీడిపల్లి వద్ద అన్ని పంపులనూ రన్‌చేసి, లక్ష్యానికి అనుగుణంగా 3,850 క్యూసెక్కుల నీటిని కాలువలో పారిస్తామని హంద్రీనీవా గుంతకల్లు ఏరియా కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస నాయక్ తెలిపారు.

## డ్రోన్స్‌తో నిఘా పెట్టండి

- ఎస్పీ జగదీష్



సమావేశంలో ఎస్పీ జగదీష్, డీఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల భద్రత కోసం డ్రోన్స్‌తో నిఘా పెట్టాలని శక్తి టీమ్స్‌ను జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించారు. డీపీఓలో శక్తి టీమ్స్‌కు ఒక రోజు శిక్షణ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్ కూడళ్ల వద్ద శక్తి టీమ్స్ నిఘా పెట్టాలన్నారు. మహిళలు, పిల్లలపై వేధింపులు, ఇతర దాడులు జరగకుండా అరికట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో ఏడు శక్తి టీమ్స్ ఉన్నట్లు తెలిపారు. శక్తి యాప్ ద్వారా బాధితుల నుంచి కాల్స్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలాలకు వెళ్లాలని ఆదేశించారు. శక్తి మొబైల్ యాప్‌పై మహిళల్లో అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్ వాట్సప్ నెంబర్ 7993485111ను సంప్రదించాలని సూచించారు. తర్వాత శక్తి టీమ్స్ కోసం ఏర్పాటు చేసిన 28 ద్విచక్ర వాహనాలను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంటేశ్వర్‌రెడ్డి, సీఐలు ధరణీకిషోర్, క్రాంతికుమార్, వెంకటేషులు శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రావణంలో అంజన్న దర్శనం శ్రేష్ఠం

- 25 నుంచి నేమకల్లులో ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు (6వ పేజీలో..)

## ఎంతపని చేస్తివి జగనన్నా..!



కట్టెల గోల్‌పోస్టు వద్ద ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

ఉరవకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పర్యటన పుణ్యమా అని ఇనుప కడ్డీలు మాయమై వాటి స్థానంలో కట్టెలు వచ్చాయి. గత ఏడాది జనవరిలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉరవకొండకు వచ్చారు. ఆ సందర్భంగా జూనియర్ కళాశాల మైదానంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. అడ్డుగా ఉందని ఫుట్‌బాల్ గోల్‌పోస్టును తొలగించారు. అయితే తర్వాత మళ్లీ దాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనను మరిపోయారు. దీంతో స్థానిక క్రీడాకారులు కట్టెలతో గోల్‌పోస్టును ఏర్పాటు చేసుకుని ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆర్డీటీ సహకారంతో రూ.65వేలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన గోల్‌పోస్ట్ ఇనుప కడ్డీలను మాత్రం మూలన పడేశారు. ఇది చూసిన స్థానిక క్రీడాభిమానులు మాత్రం ఎంతపని చేస్తివి జగనన్నా..! అంటూ వ్యంగంగా విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి ఇక్కడ మూలన పడ్డ గోల్ పోస్టును తిరిగి మైదానంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మూలన పడేసిన గోల్‌పోస్టు ఇనుప కడ్డీలు

## హైకోర్టులో ఏం జరుగుతుందో..?

- ఆర్ఎస్‌కే సిబ్బంది బదిలీల్లో అక్రమాలపై నేడు విచారణ
- ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారని కోర్టుకు వెళ్లిన 11మంది
- స్టేటస్‌కో జారీ చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



బదిలీల్లో జరిగిన అన్యాయంపై అర్జీ ఇచ్చేందుకు అనంత కలెక్టరేట్‌కు వచ్చిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు (ఫైల్)

అనంతపురం అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని ఉమ్మడి జిల్లాకు చెందిన రైతు సేవాకేంద్రం సిబ్బంది వేసిన పిటీషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైతు సేవా కేంద్రంలో పనిచేసే చేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గత నెల 28న అనంత జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత సీనియార్టీ మేరకు మొదలుపెట్టారు. దీంతో ర్యాంక్ వారిగా కౌన్సెలింగ్ నిర్వహించాలని సిబ్బం ది పట్టుబట్టడంతో మూడు గంటల తర్వాత ర్యాంక్ వారిగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా మంచి ర్యాంక్ ఉన్న సిబ్బందికి అన్యాయం జరిగిందనే ఆరోపణలు వినిపించారు. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు పలు మార్లు జిల్లా కలెక్టర్, జేడీఏలను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బాధిత సిబ్బంది న్యాయ పోరాటానికి దిగారు. ఈనెల 14న తమకు మంచి ర్యాంక్‌లున్నా తాము అడిగిన మూడు ఆప్షన్లల్లో ఏ ఒక్క స్థానం ఇవ్వకుండా అన్యాయం చేశారంటూ 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాలపాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు (మిగతా 7లో..)

## కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడో..?

- 56,291 దరఖాస్తులు పెండింగ్
- వైసీపీ హయాంలో కోత
- ఏటీఎం మాదిరి రైస్‌కార్డులు



రేషన్ కార్డు

ధర్మవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త రేషన్ కార్డుల మంజూరుకు అవకాశం ఇవ్వడంతో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. వైసీపీ హయాంలో కొత్తకార్డుల జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఇబ్బంది పడ్డారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా ఏరివేశారు. ప్రస్తుత ప్రభుత్వం కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 56,291 మంది దరఖాస్తు చేసుకున్నారు. కుటుంబంలో అదనపు సభ్యుల పేర్లు చేర్చాలంటూ 37,542 మంది వినతులు ఇచ్చారు. వైసీపీ పాలనలో రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కార్డులను భారీగా రద్దుచేశారు. ప్రభుత్వం (మిగతా 6లో...)

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

### మెడికల్ కాలేజీలో ఎక్సైజ్ ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, కళాశాల సిబ్బంది

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఆర్థికంగా, విద్యాపరంగా దెబ్బతీస్తాయని, ఎవరూ వాటి వైపు వెళ్లవద్దని, మంచి డాక్టర్లుగా బయటకు వెళ్లాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మెడికల్ కాలేజీలో డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ శ్రీరామ్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. చాలా మంది విద్యార్థులు తమకు తెలియకుండానే డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ కొనడం అంటే.. నేరంలో భాగస్వామి కావడమే అన్నారు. డ్రగ్స్‌ను అమ్మడం, రవాణా చేయడమే కాకుండా వాటిని వాడటం కూడా నేరం కిందకు వస్తుందని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెట్టాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ శ్రీరామ్ మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలో కొందరు డ్రగ్స్ కలెక్ట్ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది ఒక పవిత్రమైన కళాశాల అని, ఇక్కడ విద్యార్థులు చదువు గురించి మాత్రమే ఆలోచించాలన్నారు. డ్రగ్స్ వైపు అడుగేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, వైస్ ప్రిన్సిపాల్ శంకర్ నాయక్, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న షంషీర్

## మేమింతే.. అనుకున్నది చేస్తాం..!

- కమిషనర్ వద్దంటున్నా అక్రమ డెప్యుటేషన్లు
- నలుగురు టీచర్లకు ఎస్ఎస్ఏకు ఆర్డర్ 6

## పర్యాటక కేంద్రంగా పెనుకొండ

7 టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్

## ఘనంగా షంషీర్

- వేకువజామున ఊరేగింపు 6
- మస్తాన్‌వలి ఉరుసుకు పోటెత్తిన భక్తులు

## త్వరలో ఇన్నొవేషన్ సెంటర్ ప్రారంభం

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ



రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌ను త్వరలో ప్రారంభిస్తామని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు దశలో ఉన్న రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులు, కాన్ఫరెన్స్ హాల్, ఇతర గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ ప్రారంభం నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలన్నారు. బిల్డింగ్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పెండింగ్ పనులుంటే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఓఎస్‌డీ దీప్తి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీఈ రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆర్అండ్‌బీ జేఈ బాలకాటమయ్య, హార్టికల్చర్ అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మనోభావాలను దెబ్బతీయొద్దు

- జేసీపీఆర్ అనుచిత వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ

(వివరాలు 7వ పేజీలో....)

## శ్రావణంలో అంజన్న దర్శనం శ్రేష్టం

- 25 నుంచి నేమకల్లులో ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



నేమకల్లు గాలి గోపురం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సకల శుభాల శ్రావణ మాసం ఈ నెల 25న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నేమకల్లులో వెలసిన ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ ఉత్సవాలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో ప్రతి శని, మంగళవారాల్లో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కసాపురం, నేమకల్లు, మురిడి ఆంజనేయస్వామిని శ్రావణంలో శనివారం, మంగళవారం ఏదో ఒకరోజు దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కోసం ఎస్ఐ నబీ రసూల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. శ్రావణ మాసంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు తెలిపారు. ప్రతి శని, మంగళవారాల్లో సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ మాసంలో స్వామిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని అన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో నరసింహారెడ్డి తెలిపారు. తాగునీరు, స్నానాలకు నీటిసౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని ఈవో చెప్పారు.

## పర్యాటక కేంద్రంగా పెనుకొండ

**ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్**



గగన్‌మహల్‌ను చూసి వస్తున్న అజయ్‌జైన్, కలెక్టర్ చేతన్

పెనుకొండ/లేపాక్షి, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యం రెండో రాజధానిగా వెలుగొందిన పెనుకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ టూరిజం కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ పేర్కొన్నారు. పెనుకొండలోని శ్రీకృష్ణ దేవరాయల వేసవి విడిదిగా పేరుగాంచిన గగన్‌మహల్ రాజసౌధాన్ని జిల్లా కలెక్టర్ చేతన్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పెనుకొండకు వచ్చిన వీరికి ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ స్వాతి, ఇతరశాఖల అధికారులు పుష్ప గుచ్ఛాన్ని అందించి ఘనస్వాగతం పలికారు. చరిత్రకారుడు మైనా స్వామి, పురావస్తుశాఖ అధికారి స్వామినాయక్ పెనుకొండ చరిత్ర విశే షాలు, ప్రాచీన కట్టడాల విశేషాల గురించి అజయ్‌జైన్‌కు వివరించారు. గగన్‌మహల్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లేస్ (వివాహవేడుకల వేదిక)గా మార్చాలని కోరారు. అనంతరం వారు లేపాక్షికి బయల్దేరి వెళ్లారు.

### శిల్పకళ అద్భుతం

లేపాక్షి దుర్గా వీరభద్రస్వాముల ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఏపీ టూరిజం కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ అన్నారు. జిల్లా కలెక్టర్ చేతన్‌తో కలిసి మంగళవారం ఆయన ఆలయానికి విచ్చేశారు. ఆలయ గైడ్ విరూపణ్ణ ఆలయ చరిత్రను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. దుర్గా, వీరభద్రస్వాములకు అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరి వెంట తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, టూరిజం మేనేజర్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.



## కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

మారిన తరవాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మే 14 నుంచి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైన వారు, ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైన వారు.. ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో కొత్త కార్డుల కోసం 56,291, మార్పులు, చేర్పుల కోసం 37,542 దరఖాస్తులు వచ్చాయి. కొత్త కార్డులు మంజూరు కాకపోవడంతో దరఖాస్తు దారులు ఎప్పుడు వస్తాయోనని నిరీక్షిస్తున్నారు.

### ఇక డిజిటల్ కార్డులు

ప్రస్తుతం రేషన్‌కార్డుల్లోనూ మార్పులు చేయనున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తరువాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలను కూడా తెలపవచ్చు.

### ఆదేశాలు రాగానే కొత్త కార్డులు



కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించి జాబితాను తయారుచేసి పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త రేషన్‌కార్డులను అందజేస్తాం. ఏటీఎంలాగా ఉన్న కార్డులను లబ్ధిదారులకు ఇస్తాం.

**- వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ**

### మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా



నాకు వివాహమై ఆరేళ్లవుతోంది. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు అడుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నా. నా కుమార్తె ఒకటో తరగతి చదువుతోంది. ప్రభుత్వ పథకాలు రావాలంటే బియ్యంకార్డు అవసరం. ఈ ప్రభుత్వమైనా బియ్యం కార్డు మంజూరు చేయాలని కోరుతున్నా.

**- రఘు, బసవన్నకట్ట వీధి, కొత్తచెరువు**

## పీఎస్ హెచ్‌ఎం నరసింహులు సస్పెన్షన్

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం పాతకల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరసింహులును సస్పెండ్ చేస్తూ డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వారం రోజుల క్రితం ఆ మండల ఎంఈఓలు వెంకటరమణనాయక్, చంద్రానాయక్ కలిసి నరసింహులు పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లారు. రికార్డులు, పని తీరు సరిగా లేవని షోకాజ్ నోటీసు ఇవ్వడానికి ఎంఈఓలు నిర్ణయం తీసుకున్నారు. ఇంతకు ముందే ఎంఈఓలు పీఎస్ హెచ్ఎం మధ్య మనస్పర్థలు ఉండడంతో మళ్లీ గొడవకు దిగారు. నరసింహులు, ఆయన కుమారుడు ఎంఈఓలతో వాగ్వాదం చేసుకుంటూ వారి ఫోన్లు లాక్కొని నేలకేసి పగులకొట్టారు. దీనిపై ఎంఈఓలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ హెచ్‌ఎం నరసింహులును సస్పెండ్ చేశామని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు.



స్వామికి సమర్పించిన షంషీర్

స్వామికి చక్కెర చదివిస్తున్న భక్తులు



## ఘనంగా షంషీర్

**వేకువజామున ఊరేగింపు**

**మస్తాన్‌వలి ఉరుసుకు పోటెత్తిన భక్తులు**

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి 390వ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మస్తాన్ వలి షంషీర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. షంషీర్‌ను తిలకించడానికి భక్తులు పోటెత్తారు. దర్గా నుంచి ఊరువాకిలి వరకు భక్తులతో కిక్కిరిసింది. పాతగుంతకల్లులోని ఊరువాకిలిలో నివాసముంటున్న రెడ్డి కులస్థుల ఇంటి నుంచి వేకువజామున స్వామి షంషీర్ ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, యువకుల కేరింతల నడుమ, దివిటీల మధ్య షంషీర్‌ను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. పాతగుంతకల్లులోని శివాలయం వద్ద ఉన్న బావిలో నుంచి భక్తులు బిందెలతో నీటిని తీసుకుని అశ్వం పాదాలకు పోసి మొక్కులు తీర్చుకున్నారు. షంషీర్‌ను స్వామికి సమర్పించి, ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు ఎండు కొబ్బరిని దివిటీలలో కాల్చి ప్రసాదంగా తీసుకెళ్లారు. స్వామికి చాదర్, పూల హారాలు, చక్కెర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ ఏపీ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

### చాదర్ సమర్పించిన ఎమ్మెల్యే

పాతగుంతకల్లులోని హజరత్ సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో ఉరుసు ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామికి చాదర్ సమర్పించారు. దర్గాలో ఎమ్మెల్యేకు టీడీపీ మైనార్టీ నాయకులు స్వాగతం పలికారు. ముజావర్లు ఫాతేహాలు చదివి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వా మి, బండారు రామన్న చౌదరి, ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, మస్తాన్, ఫజులు, ఖాజా, సలీం, షంషుద్దీన్ పాల్గొన్నారు.

## స్వాగతం కృష్ణమ్మా..!

(5వ పేజీ తరువాయి)

కంటే అధికంగా ఎత్తిపోతలు సాధ్యపడతాయని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

### ఎత్తిపోతల్లో రికార్డు

హంద్రీనీవాకు సాగునీటి ఎత్తిపోతలు ప్రారంభించే అంశంలో ఈ సంవత్సరం ఓ రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూలై 17కే ఎత్తిపోతలను ప్రారంభించారు. 2020-21 సీజన్‌లో జూలై 24న ఎత్తిపోతలు మొదలయ్యాయి. ఆ సీజన్‌లో గరిష్ఠంగా 266 రోజులపాటు హంద్రీనీవాలో నీరు పారింది. సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. 2021-22 సీజన్‌లో జూలై 27వ తేదీ నుంచి 201 రోజులు, 2022-23 సీజన్‌లో జూలై 24వ తేదీ నుంచి 237 రోజులు, 2023-24లో ఆగస్టు 21వ తేదీ నుంచి 207 రోజులు, 2024-25 సీజన్‌లో ఆగస్టు 13వ తేదీ నుంచి 212 రోజులపాటు నీరు లభించింది. ఈ సంవత్సరం ఇంకాస్త ముందే పంపింగ్ ప్రారంభించాల్సి ఉన్నింది. శ్రీశైలం డ్యాంలో ఈ నెల తొలి వారంలోనే ఎత్తిపోతలకు తగినన్ని నీటి నిల్వలు ఉన్నా, హంద్రీనీవా విస్తరణ పనుల కోసం ఎత్తిపోతలను చేపట్టలేకపోయారు.



కాలువలో చనిపోయిన చేపలు

### నీటిలో రసాయనాలు..?

హంద్రీనీవాకు కాస్త ముందుగానే నీరు వచ్చినా, సాగు భూములకు తడులను అందించడానికి కొంత సమయం తీసుకోనున్నారు. హంద్రీనీవా విస్తరణ ప్రక్రియలో రాళ్లను పగులగొట్టడానికి జిల్లాలో జీడిపల్లి వరకూ జిలెటిన్ స్టిక్స్‌ను వినియోగించారు. వెంటనే పొలాలకు నీటిని విడుదల చేస్తే పేలుడులో వినియోగించిన గంధకం, భాస్వరం కారణంగా భూములు పాడౌతాయని రైతులు భావిస్తున్నారు. దీన్ని రుజువు చేస్తూ హంద్రీనీవా ప్రవాహంలో వేలాదిగా చేపలు చనిపోయి కొట్టుకువస్తున్నాయి. సాధారణ సమయంలో ఆ పరిస్థితి కనిపించేది కాదు. రైతులు అనుమానించినట్లే నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. ఈ కారణంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు నీటిని పంపింగ్ కూడా కొన్ని రోజులు వాయిదా వేసుకోవడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతానికి భూములకు తడులు ఇవ్వాల్సిన అవసరం లేదని రైతులు అంటున్నారు.

## కార్యసాధకుడు చంద్రబాబు

**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**



కసాపురం వద్ద జల హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి):హంద్రీనీవా విస్తరణ పనులను వంద రోజుల్లో పూర్తిచేసిన కార్యసాధకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కొనియాడారు. కృష్ణా జలాలు జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా కసాపురం సమీపంలో ఆయన జల హారతి ఇచ్చారు. రాయలసీమలో హంద్రీనీవాకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన చంద్రబాబు, విస్తరణ పనులను చేపట్టి, సకాలంలో పూర్తిచేయించారని అన్నారు. ఐదేళ్ల అధికారాన్ని వెలగబెట్టిన జగన్.. ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలాన్ని వృథా చేశారని అన్నారు. విస్తరణ పనులు పూర్తయినందున రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. హంద్రీనీవాలో రికార్డు స్థాయిలో నీరు పారుతుందని, నీటిని సక్రమంగా వినియోగించుకుని ఫలితాలు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఈఈ శ్రీనివాస నాయక్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, విజయలక్ష్మి, పూల రమణ తదితరులు పాల్గొన్నారు.

## మేమింతే.. అనుకున్నది చేస్తాం..!

- కమిషనర్ వద్దంటున్నా అక్రమ డెప్యుటేషన్లు
- ఎస్ఎస్ఏకు నలుగురు టీచర్లు
- డీపీసీ, ఏపీసీ నిర్ణయాలపై టీచర్ల విస్మయం



నలుగురిని ఎస్ఎస్ఏకు డెప్యుటేషన్ వేస్తూ డీఈఓ ఇచ్చిన ఉత్తర్వులు

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'ఎవరో చెబితే వినాలా.. ఎవరికీ భయపడేదిలేదు.. మేమింతే, అనుకున్నది చేస్తాం' అనే భావనతో జిల్లా సమగ్రశిక్ష శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇందుకు వారిచ్చిన డెప్యుటేషన్ల ఉత్తర్వులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లా సమగ్రశిక్షలో దాదాపు ఏడాదిగా కీలకమైన సెక్టోరల్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలకు కోట్లు నిధులు ఇస్తున్నారు. విద్యా పథకాల పర్యవేక్షణ పడకేసింది. విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయి. అలాంటపుడు సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి ఎస్ఎస్ఏ అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి వివాదం రావడంతో ఇద్దరిని మాత్రమే తీసుకున్నారు. ఇంకా ఆరు పోస్టులు అలాగే ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి మళ్లీ గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు వచ్చాయి. 20 రోజులు దాటినా ఆ దరఖాస్తుల గురించి పట్టించుకోలేదు. పైగా కొంతమంది టీచర్లను డెప్యుటేషన్‌లో తీసుకోవడానికి చూస్తున్నారని తెలియడంతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రెండురోజుల క్రితం 'సమగ్రశిక్షలో చోద్యం, మళ్లీ డెప్యుటేషన్ల పేరుతో వివాదం' అనే కథనం ప్రచురితమయింది. డెప్యుటేషన్‌పై ఎవరినీ నియమించుకోరాదని కమిషనర్ విజయరామరాజు పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా వారు అనుకున్నట్లే నలుగురు టీచర్లను ఎస్ఎస్ఏకు డిప్యుటేషన్లు వేశారు. ఇందులో హెచ్‌ఎం ప్రహ్లాదనాయుడు, మోడల్ స్కూల్స్ హెచ్‌ఎంలు నారాయణస్వామి, చలపతినాయుడు ఎస్జీ టీచర్ ఆంజనేయులును డిప్యుటేషన్‌లో నియమించుకున్నారు. ఇందుకు డీఈఓ ప్రసాద్‌బాబు ఆమోదం కూడా వేశారు. ఏపీసీ అడిగారని, అక్కడి నుంచి వచ్చిన జాబితా మేరకే ఉత్తర్వులు ఇచ్చానని డీఈఓ అంటున్నారు. ఎస్ఎస్ఏలో జీసీడీఓగా కవిత, అసిస్టెంట్ ఏఎంఓగా ఫణికుమార్ పనిచేస్తున్నారు. ఇందులో కవితకు శాఖలో ఖాళీగా ఉన్న ఐఈడీ కోఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించారు. ఫణికుమార్‌కు శాఖలో ఖాళీగా ఉన్న ఏఎంఓ, సీఎంఓ, అలెస్కో సెక్టోరియల్ పోస్టుల బాధ్యతలను అప్పగిస్తూ ఏపీసీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నలుగురు టీచర్లను ఎందుకు ఆ శాఖకు డెప్యుటేషన్ వేసుకున్నారో అర్థంకావడంలేదు. ఇంకోవైపు నోటిపికేషన్ ఇచ్చి దరఖాస్తులను తీసుకున్న ఎస్ఎస్ఏ అధికారులు నియామకాలు చేపట్టకుండా ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియక టీచర్లు సతమతమవుతున్నారు.

## నైపుణ్యాలతోనే నవ భారత్: ఎంపీ అంబికా




వార్షికోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యాలను పెంచితే దేశం నవ భారత్ వైపు పయనిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. డిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం నిర్వహించిన స్కిల్ ఇండియా మిషన్ 10వ వార్షికోత్సంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పదేళ్లుగా స్కిల్ ఇండియా మిషన్ లక్షలాది మందిలో నైపుణ్యాలను పెంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని ఎంపీ అన్నారు. ఇది భవిష్యత్తు భారతానికి పునాది వంటిదని అన్నారు. నైపుణ్యం ఉన్న యువత దేశ నిర్మాణానికి ముఖ్య ఆధారమని అన్నారు. యువతను శిక్షణతో శక్తివంతులుగా తీర్చిదిద్దే ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎంపీ తెలిపారు.

## నకిలీలతో రైతన్నకు మోసం..!

- తక్కువ ధరలకే క్రిమిసంహారక మందులు
- నిలువునా ముంచుతున్నా పట్టించుకోని అధికారులు
- కొరవడిన పర్యవేక్షణ



తనకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నకిలీ క్రిమి సంహారక మందులను సరఫరా చేస్తూ కొందరు ఎరువుల దుకాణదారులు రైతులను మోసగిస్తున్నారు. బయో పేరుతో ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తూ రైతును నిండా ముంచుతున్నారు. రసాయన ఎరువుల విక్రయాల్లో ఎమ్మార్పీకి విక్రయించాలంటూ సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తనిఖీల సమయంలో ఎరువులకు సంబంధించిన పీసీ (ప్రొడ్యూసర్ కంపెనీ)లు లేకపోతే వాటిని సీజ్ చేస్తున్నారు. దుకాణదారులు ఎరువులతోపాటు క్రిమిసంహారక మందులును కూడా విక్రయిస్తున్నాయి. 250 నుంచి 300 పైచిలుకు రకాల క్రిమిసంహారక మందులను విక్రయాలు కొనసాగిస్తున్నారు. వీటిలో కూడా పీసీలు ఉంటేనే విక్రయించాలన్న నిబంధనలున్నాయి. కొంతమంది ఎరువుల దుకాణదారులు పీసీలో పొందపరచని క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులను వివిధ ఏజెన్సీల ద్వారా తక్కువ ధరలకు కొనుగోలు చేసి, అధికారుల కన్ను కప్పి, రైతులకు ఎమ్మార్పీకంటే తక్కువకు విక్రయిస్తున్నారు. దీంతో లైసెన్సులు పొంది, సక్రమంగా వ్యాపారం నిర్వహించే కొంతమంది తమ వ్యాపారాలను కొనసాగించలేకపోతున్నారు. ఎలాంటి పీసీ లేకుండా వివిధ ఏజెన్సీల ద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేసిన, బయో మందులు(నకిలీ)వాటి పైనున్న ధరలకంటే తక్కువగా విక్రయిస్తున్నారు. నిజమైన కంపెనీల నుంచి పొందిన డ్రిప్పు మందులను, బయోలను వ్యాపారులు అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు. రసాయన కంపెనీల నుంచి అనుమతి పొందిన ఏజెన్సీలు ఆ ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీలకే విక్రయిస్తున్నారు. దీంతో ఎరువుల దుకాణదారులు ట్రాన్స్‌పోర్టు, కూలీలు, వడ్డీలు, లాభం కోసం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువగా విక్రయించాల్సి వస్తోందని అంటున్నారు. ఇంత జరుగుతున్నా, సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చే ఎరువులను ఎమ్మార్పీలకు విక్రయించలేని వ్యాపారులు.. వివిధ కంపెనీలు సరఫరా చేసే క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులను ఎమ్మార్పీ కంటే తక్కువ కు విక్రయిస్తుండడం చర్చనీయాంశమైంది. ఎన్నో మోసపూరిత కంపెనీలు తమ బ్రాండ్ల పేరుతో నకిలీలను విక్రయిస్తున్నట్లు ఇటీవల రైతులు కూడా గుర్తిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేసి నకిలీల నిగ్గు తేల్చాలని రైతులు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

ఎరువుల దుకాణదారులు తమ వద్ద ఉన్న పీసీల్లో లేని బయోలు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులు, విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఆకస్మిక దాడులు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకుంటాం. రైతుకు మోసం జరిగే ఏ కార్యక్రమమైనా చట్టవిరుద్ధమే.

**- సనావుల్లా, ఏడీ, వ్యవసాయశాఖ**

### మోసపోతున్నాం..



పంటలకు వచ్చే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణ కోసం మందులను కొనుగోలుచేసి పిచికారి చేస్తున్నాం. ఇందులో కంపెనీలు విక్రయించే వాటికన్నా, బయోలు తక్కువ ధరకే విక్రయిస్తుండడంతో నష్టపోతున్నాం. డ్రిప్ ఎరువులు, కంపెనీల ఎరువులకు, బయోల ఎరువులకు చాలా తేడా ఉంది. ఎరువుల దుకాణదారులు పురుగుల మందులను తక్కువ ధరలకు విక్రయించడం, ఎరువులకు ఎక్కువ ధరకు విక్రయించడం ఈ మతలబు ఏమిటో అంతు చిక్కడంలేదు.

**- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివారిపల్లి**

### డ్రిప్ ఎరువుల్లో భారీ మోసం



డ్రిప్ ఎరువులు, పురుగు మందుల్లో రైతులకు భారీగా మోసం జరుగుతోంది. ఏవి నకిలీవో, ఏవి అసలువో అంతుచిక్కడంలేదు. ఎరువుల దుకాణదారులు పురుగు మందులను, డ్రిప్ ఎరువులను ఎమ్మార్పీ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. రసాయన ఎరువులను మాత్రం విక్రయించడంలో ఇబ్బందులున్నట్లు చెబుతారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాలపై పర్యవేక్షించి, రైతులకు సక్రమమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఎరువులు అందేలా కృషిచేయాలి.

**- సూర్యనారాయణ, రైతు, కొత్తకురవపల్లి**

## చెత్తగా.. చెత్త సేకరణ

**ఎంపీడీఓలు, డిప్యూటీలకు మెమోలు ఇవ్వండి**

**ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ**



అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్త సేకరణలో పలు మండలాల్లో 50శాతం కన్నా ఎక్కువ నెగెటివ్ వచ్చిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. ప్రభుత్వ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఈ విషయం స్పష్టమైందని అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పంచాయతీ సెక్టార్, జీఎస్‌డబ్ల్యుఎస్ తదితర అంశాలపై డీపీఓ, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహించిన ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల (జీఎస్‌డబ్ల్యుఎస్) పెండింగ్ అంశాల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తల్లికి వందనం కోసం తల్లి, బిడ్డల ఈకేవైసీని వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసెస్ డాష్ బోర్డు, మన మిత్ర క్యాంపెయిన్‌లో పెండింగ్ అంశాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. సిటిజన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటాను వేగంగా చేపట్టాలని అన్నారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ 100శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయనివారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని, సచివాలయాలలో క్యూఆర్ కోడ్ పెట్టాలని, ప్రజల ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ నాగరాజు నాయుడు, సీపీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరంతో టీడీపీ కార్యకర్త మృతి

### కుటుంబాన్ని పరామర్శించిన పరిటాల శ్రీరామ్




రామాంజనేయులు (ఫైల్), కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న శ్రీరామ్

ధర్మవరం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమల గ్రామంలో డీలర్ చెన్నప్ప పెద్ద కుమారుడు, టీడీపీ కార్యకర్త కొండపాకుల రామాంజనేయులు(30) విషజ్వరంతో మృతి చెందాడు. మంగళవారం కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు ఇటీవల పని నిమిత్తం బెంగళూరుకు వెళ్లాడు. రెండురోజుల క్రితం విషజ్వరంతో బాధపడుతూ గ్రామానికి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. సోమవారం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య గాయిత్రి, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. రామాంజనేయులు టీడీపీ బూత్‌కన్వీనర్‌గా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నారని, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని స్థానిక నాయకులు తెలిపారు.

### కుటుంబాన్ని ఆదుకుంటాం : పరిటాల శ్రీరామ్

దర్శినమల టీడీపీ బూత్‌కన్వీనర్ రామాంజనేయులు మృతి చెందిన విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మంగళవారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. మృతుడి భార్య గాయిత్రికి జీవనాధారం కోసం సహాయం అందిస్తామని తెలిపారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, విజయసారథి, నరసింహులు, పార్థారెడ్డి, రవి, తదితరులు ఉన్నారు.

## ముసలమ్మ ఆలయంలో చోరీ

### హుండీలో నగదు, 5 గ్రాములు బంగారం మాయం



ఆలయ హుండీని బయట పడేసిన దుండగులు

బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ముసలమ్మ దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న 5 గ్రాముల బంగారం, హుండీలో ఉన్న నగదును సోమవారం రాత్రి చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు అనంతపురం- తాడిపత్రి రహదారి పక్కన, చెరువు కట్ట వద్ద ముసలమ్మ దేవాలయం ఉంది. గుర్తు తెలియని దుండగులు ఈ ఆలయం వాకిలి పగలకొట్టి చొరబడ్డారు. ఆలయంలో ఉన్న హుండీ పగలకొట్టి అందులో ఉన్న నగదు, అమ్మవారి తాళిబొట్టు చైను, 5 గ్రాముల బంగారు చోరీ చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు హార్డ్‌డిస్క్ పగలకొట్టి ఎత్తుకెళ్లారు. హుండీలో దాదాపు రూ.4 లక్షల నుంచి 5 లక్షల వరకు ఉంటుందని ఆలయ కమిటీ ఛైర్మన్ సుశీలాదేవి, సుర్యనారాణరెడ్డి సీఐ పుల్లయ్యకు తెలిపారు. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి హిజ్రా ఆత్మహత్య



శ్రీవాణి(ఫైల్)

గుత్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని రామరాజుపల్లి-పామిడి రైల్వేస్టేషన్ మధ్య మిడుతూరు గ్రామ సమీపంలో రైలు కింద పడి నాగలపల్లి వంశీ అలియస్ శ్రీవాణి(21) అనే హిజ్రా ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. పామిడి మండలం ఎదరూరు గ్రామానికి చెందిన వంశీ, అలియస్ శ్రీవాణి సోమవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని అన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

## నీవు లేకుండా ఎలా బతికేది నాన్నా..!

### కుమారుడి ఆత్మహత్య.. కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



మన్సూర్‌వలి (ఫైల్)

తాడిపత్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'నీకు ఉద్యోగం లేకపోయినా బతకగలం. నీవు లేకుండా ఎలా బతికేది నాన్నా ..! ఎందుకు ఇలా చేశావ్?' అంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు విలపించిన సంఘటన మంగళవారం తాడిపత్రిలో జరిగింది. పట్టణంలోని విజయనగర్‌కాలనీకి చెందిన మన్సూర్‌వలి (22) ఉద్యోగం రాలేదని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఇస్మాయిల్, హర్షాబీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా మరో కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. కుమారుడు బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడం తో తల్లిదండ్రులు బోరున విలపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బకాయి చెల్లించాలని ఎంపీఈఓకు నోటీసు

అనంతపురం అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఎంపీఈఓ ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి ఎరువుల విక్రయాలకు సంబంధించి ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1.28 లక్షలు బకాయి ఉండటంతో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ నోటీసు జారీ చేశారు. బత్తలపల్లిలో పనిచేస్తున్న సమయంలో ఎంపీఈఓ బకాయి పడ్డారు. అక్కడి నుంచి బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి రైతు సేవా కేంద్రానికి ఆ ఎంపీఈఓ బదిలీపై వచ్చారు. రెండేళ్ల నుంచి బకాయి డబ్బులు చెల్లించకపోవడంతో ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బకాయి సొమ్ము చెల్లించాలని ఆమె నోటీసులు జారీ చేశారు. లేనిపక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీయొద్దు

### ప్రజాప్రతినిధులే దాడులకు పాల్పడితే ఎలా..?
### జేసీపీఆర్ అనుచిత వ్యాఖ్యలు అభ్యంతరకరం
### ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ



డీపీఓతో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి కమిటీ చైర్మన్, నాయకులు

అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు సహకరించాల్సిన ప్రజాప్రతినిధులే వారిపై దాడులకు సిద్ధపడితే ఎలా అని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ ప్రశ్నించింది. రెండ్రోజుల క్రితం డీపీఓ నాగరాజునాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని కమిటీ జిల్లా చైర్మన్ ఆర్ఎన్ దివాకర్ రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో డీపీఓ నాగరాజునాయుడును కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జేసీ వ్యాఖ్యలను రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం అనాలా..? ఏమైనా మాట్లాడవచ్చని భవిష్యత్ తరాలకు ఇచ్చే సంకేతంగా భావించాలా..? అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల వద్దే ఉద్యోగులకు రక్షణ కరువైతే ఎవరికి చెప్పుకోవాలన్నారు. విధినిర్వహణలో అధికారులు చేసింది తప్పయితే ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న ఒక ప్రజాప్రతినిధి ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి స్పందించి తగిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ సిబ్బంది, అధికారులకు భరోసా కల్పించాలని అన్నారు. డీపీఓను కలిసిన వారిలో కమిటీ ఉపాధ్యక్షుడు కొండయ్య, మూర్తి, ఓబుళేసులు ఉన్నారు.

## హైకోర్టులో ఏం జరుగుతుందో..?

(5వ పేజీ తరువాయి)

రిట్ పిటీషన్‌పై స్టేటస్‌కో ఇచ్చింది. ఇదే క్రమంలో సంబంధిత న్యాయవాది తరఫున అనంత జేడీఏ కార్యాలయంలో కోర్టు ఆర్డర్‌ను అందజేసినట్లు సమాచారం. అయితే తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబం ధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. న్యాయవాది ద్వారా ఆర్డర్‌ను జేడీఏ కార్యాలయంలో అందజేసినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని బాధిత సిబ్బంది వాపోతున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు వారాలపాటు సిబ్బందిని యథాస్థానంలో ఉంచాల్సి ఉంది. అయితే సంబంధిత ఉన్నతాధికారులు ఆ పని చేయకపోవడం గమనార్హం.

### నేడు విచారణ

శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లతో పాటు కర్నూలులో 20 మంది, ప్రకాశం జిల్లాకు చెందిన ఏడుగురు అగ్రికల్చర్ అసిస్టెంట్లు తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందని హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. మూడు జిల్లాల సిబ్బంది రిట్ పిటీషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్‌కో ఆర్డర్లు జారీ చేసింది. అయితే మూడు జిల్లాల సిబ్బందిది ఒకే సమస్య కావడంతో అందరి పిటీషన్లను కలిపి బుధవారం విచారణ చేయాలని హైకోర్టు నిర్ణయించింది.

### ఓ అధికారి వైఖరితోనే...

ఉమ్మడి జిల్లాలో అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఓ అధికారి బదిలీల్లో తనకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఆయన వైఖరితోనే తమకు అన్యాయం జరిగిందని బాధిత సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ముడుపుల బాగోతం నేపథ్యంలోనే బదిలీల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనంత జిల్లాలోని పలువురు సిబ్బందికి అన్యాయం జరిగినా... బయటకు చెప్పుకునేందుకు భయపడుతున్నట్లు సమాచారం. అయితే శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది తమకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటానికి దిగారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు హరినాథ్‌రెడ్డి, జహీర్, రేణుకా, సుస్మిత, జనార్దన్, తరుణ్‌రెడ్డి, శిరీష, రజిత, సంధ్య, నేత్ర, సర్‌తాజ్‌లు హైకోర్టులో రిట్ పిటీషన్ వేసిన వారిలో ఉన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సుస్మితది ఉమ్మడి అనంత జిల్లాలో ఐదో ర్యాంక్, శ్రీసత్యసాయి జిల్లాలో రెండో ర్యాంక్, మరో అగ్రికల్చర్ అసిస్టెంట్ జనార్దన్‌ది ఉమ్మడి జిల్లాలో ఆరో ర్యాంక్, సత్యసాయి జిల్లాలో మూడో ర్యాంక్ ఉన్నప్పటికీ బదిలీల్లో అన్యాయం చేశారు. ఆ సిబ్బంది అడిగిన మూడు ఆప్షన్లల్లో ఏ ఒక్కటి ఇవ్వకుండా.. తక్కువ ర్యాంక్ ఉన్న సిబ్బందికి ఆయా స్థానాలు ఇచ్చారని బాధిత సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

## రైళ్ల వేళల మార్పు

గుంతకల్లు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్ల సమయాలను సవరించినట్లు మంగళవారం రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-గ్వాలియర్ ఎక్స్‌ప్రెస్ (11085) సెప్టెంబరు 22 నుంచి ఐదు నిమిషాలు ఆలస్యంగా అనంతపురానికి రాత్రి 8-23 గంటలకు వస్తుందన్నారు. ధర్మవరం-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ (17248) తిరుపతికి సెప్టెంబరు 17 నుంచి 25 నిమిషాలు ముందుగా సాయంత్రం 6-20 గంటలకే చేరుకుంటుందన్నారు. ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22159) గుంతకల్లుకు జూలై 25 నుంచి అరగంట ఆలస్యంగా ఉదయం 3 గంటలకు చేరుకుంటుందన్నారు. హుబ్లీ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (17313) ఈనెల 25 నుంచి గుంతకల్లుకు ఐదు నిమిషాలు ఆలస్యంగా ఉదయం 3-05 గంటలకు చేరుతుందన్నారు. ఏక్తానగర్-చెన్నై ఎక్స్‌ప్రెస్ ( 20920) ఈ నెల 30 నుంచి 15 నిమిషాల ఆలస్యంగా ఉదయం 6-55 గంటలకు చేరుకుంటుందన్నారు. అహ్మదాబాద్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22920) ఈ నెల 28 నుంచి గుంతకల్లుకు 15 నిమిషాల ఆలస్యంగా ఉదయం 6-55 గంటలకు చేరుతుందన్నారు. ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (12163) ఈ నెల 25 నుంచి గుంతకల్లుకు 20 నిమిషాల ఆలస్యంగా ఉదయం 8 గంటలకు చేరుతుందని తెలియజేశారు. పూనా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381) ఈ నెల 25 నుంచి గుంతకల్లుకు 20 నిమిషాలు ఆలస్యంగా ఉదయం 9-50 గంటలకు చేరుకుంటుందని వెల్లడించారు.

## జర్మనీ భాషపై ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ చేసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జర్మనీ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ కుష్బూకొఠారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 8నెలల పాటు ఈశిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో ఈశిక్షణకేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. అర్హత కలిగి ఎంపికైన ఎస్సీ, ఎస్టీ బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని హార్డ్‌కాపీలను జిల్లా కార్యాలయంలో అందజేయాలని డీడీ కోరారు.

### రూడ్‌సెట్‌లో ఫొటో, వీడియోగ్రఫీలో...

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 29 నుంచి ఆగస్టు 28 వరకు ఉచితంగా ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. 31రోజుల పాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్‌కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థ కార్యాలయంలో నేరుగా లేదా సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

## టమోటా కిలో రూ.40



అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.20, సరసరా సరిధర రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు.

## అందరికీ ఉద్యోగోన్నతులు ఇవ్వండి

### - యూటీఎఫ్



విద్యాశాఖ ఏడీకి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): అన్నిసబ్జెక్టు టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులును యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, రమణయ్య, సుధాకర్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ఇద్దరు టీచర్లకు.. మిగిలిన ఫిజికల్ సైన్స్ పోస్టులకు ఉద్యోగోన్నతులు ఇవ్వడం హర్షణీయమే అన్నారు. అలాగే ఇతర సబ్జెక్టుల లోను అనేక పోస్టులు మిగిలిపోయాయని, వాటికి సంబంధిత అర్హత కలిగిన ఎస్టీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరికి మాత్రమే ఉద్యోగోన్నతులు ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అలా కాకుండా అందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్‌లో మంగలవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 754 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## కేసీ నారాయణకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గుంతకల్లు టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త, అనంతపురం జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, శంకరానందగిరిస్వామి ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ కరస్పాండెంట్ కేసీ నారాయణ తృతీయ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని కేసీ నారాయణ విగ్రహానికి కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్ సురేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కేసీ నారాయణ తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాలలను స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తమ్మినేని వెంకటరమణ, బసెట్టి క్రిష్ణయ్య, పూజారి గోపీ, ఎం ఖాజావలి, నటరాజ్, వరప్రసాద్, కురుపాటి రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పని చేయండి: డీటీడబ్ల్యూఓ

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేసి గిరిజన సంక్షేమ శాఖకు మంచి పేరు తేవాలని వార్డెన్లకు డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు సూచించారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ అడ్మిషన్లు పెంచడానికి కృషి చేయాలన్నారు. తొలుత ఎస్టీ పిల్లలకు అవకాశం ఇచ్చిన తర్వాతనే ఇతర కులాల విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. గురుకులాల్లోనూ ఇదేవిధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ సురేష్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

## డ్రిప్‌ను సద్వినియోగం చేసుకోండి: ఏపీడీ

బెళుగుప్ప, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ పేర్కొన్నారు. మంగళవారం ఏపీడీ మండలంలోని నక్కలపల్లి వద్ద వ్యవసాయ తోటలో పర్యటించి రైతులకు బిందు సేద్య పరికరాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 17 వేల హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాల పంపిణీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పంటలు పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఏఓ మల్లేష్ సిబ్బంది దిలీప్, అవినాష్ పాల్గొన్నారు.

## ఈ- చలాన్ లింక్స్‌తో జాగ్రత్త: ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ-చలాన్ పేరుతో వచ్చే లింక్స్ ప్రమాదకరమని, వాటిని ఎవరూ ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆర్టీవో, ట్రాఫిక్ చలాన్, ఏపీకే పేరుతో కొన్ని లింకులు వైరల్ అవుతున్నాయన్నారు. ఇలాంటి లింక్స్ ఎవరూ డౌన్‌లోడ్ గానీ, ఓపెన్ గానీ చేయవద్దని ఆయన సూచించారు. పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కేవైసీ అప్డేట్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడే మోసగాళ్లు ఈ తరహా లింకులు పంపి మోసాలకు పాల్పడతారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనధికార లింక్స్‌ను ఎవరూ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు.

## అగ్రిగోల్డ్ రికార్డులు సిద్ధంగా ఉంచుకోండి: డీఆర్ఓ



అధికారులతో సమావేశమైన డీఆర్ఓ

అనంతపురం కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్రిగోల్డ్ ఆస్తుల భౌతిక ధ్రువీకరణ పూర్తి చేసి, రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని డీఆర్ఓ మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అగ్రిగోల్డ్ ఆస్తులపై సంబంధిత కమిటీ మెంబర్లతో డీఆర్ఓ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తుల అటాచ్‌మెంట్‌పై జిల్లా స్థాయిలో జేసీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ విలువ, మార్కెట్ విలువ గుర్తింపు చేయాలని, అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏంటి, ఆక్రమణలు, కోర్టు కేసులు తదితర అంశాలకు సంబంధించి పరిశీలన చేయాలన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, సంబంధిత తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, కర్నూలు సీఐడీ ఇన్‌స్పెక్టర్ ప్రీతంరెడ్డి, అశోక్, ఎస్ఐ శివకుమార్‌నాయక్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డీపీఆర్ఓ బాలకొండయ్య, ఐటీ ఆఫీసర్ రవి, ఎన్ఐసీ డీఐఓ రవిశంకర్, తహసీల్దార్లు సోమశేఖర్, శేషారెడ్డి, సుమతి, శ్రీనివాసులు, అగ్రిగోల్డ్ ప్రతినిధి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారు భవిష్యత్తును వదిలి..

### ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



భారతి

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కళ్లముందు కదలాడుతున్న భవిష్యత్తు 'బంగారాన్ని' వదిలి ఓ మహిళ ఒకటిన్నర తులం బంగారం కోసం ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మండలంలోని నల్లదాసరిపల్లిలో మంగళవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన మస్తాన్, పద్మా దంపతుల కుమార్తె భారతి(20)ని తమ సమీప బంధువు గుంతకల్లు పట్టణానికి చెందిన రాముకు ఇచ్చి గత ఏడాది మార్చిలో వివాహం చేశారు. కాన్పు కోసం భారతి ఆరు నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. కుమారుడు జన్మించాడు. అందరూ ఆనందంగా ఉన్న సమయంలో తల్లిదండ్రులు పెళ్లి సమయంలో ఇస్తామన్న ఒకటిన్నర తులం బంగారం విషయాన్ని భారతి సోమవారం ప్రస్తావించింది. ఏడాది తరువాత ఇస్తామని తల్లిదండ్రులు చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన భారతి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీకి ఉన్న ఇనుప కడ్డీకి చీరతో ఉరి వేసుకుంది. కాసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు ఉరికి వేలాడు తున్న ఆమెను కిందికి దించి పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారిం చారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప తెలిపారు.

## 28 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 28 మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తిలో 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంతకల్లు, యాడికి, బెళుగుప్ప 20.2, యల్లనూరు 15.2, విడపనకల్లు 14.2, తాడిపత్రి 12.4, ఉరవకొండ 10.2, రాప్తాడు 9.2, గుమ్మఘట్ట 8.8, రాయదుర్గం 7.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 6.4మి.మీ. లోపు కురిసింది. అనంతపురం, శింగనమల, పుట్లూరు, యాడికి మండలాల్లో మంగళవారం జల్లులు పడ్డాయి.

### రానున్న ఐదు రోజులకు వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.5-33 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.7-23.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చు అన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 6 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

## చెట్టుకొమ్మ పడి మహిళ మృతి

గుడిబండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్‌చార్జ్ నాగరాజు భార్య అరుణ(34)పై చెట్టు కొమ్మ విరిగిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో కరేకెర కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు ద్విచక్ర వాహనంలో వెళుతున్న సమయంలో కేఎన్‌పల్లి, చిగతుర్పి మధ్యలో గాలికి చెట్టుకొమ్మ విరిగి తలమీద పడటంతో కిందపడింది. గాయపడ్డ అరుణను వెంటనే మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

న్యూస్ బాక్స్

## ఘనంగా ఆషాఢమాసం బోనాలు



బోనాలు మోసుకొస్తున్న మహిళలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఐలమ్మ కాలనీలో మంగళవారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గంగమ్మ బోనాలు జాతరను ఘనంగా నిర్వహించారు. పాతూరులోని చాకలి ఐలమ్మ కాలనీలో రజకులు గంగమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ రజకవృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య హాజరయ్యారు. రజకులు, మహిళలు గంగమ్మకు తమ మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా కార్యదర్శి హరికృష్ణ, కాలనీ కార్యదర్శి నాగరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్న నారాయణస్వామి, భూషణ, శీన, ఆదినారాయణ, సంజీవులు, లక్ష్మీనారాయణ, ఓబుళేసు, మారుతి పాల్గొన్నారు.

### పోతులయ్యకు...



బోనాలతో వస్తున్న పాములరాయి గ్రామస్థులు

అనంతపురం రూరల్: మండలంలోని సోములదొడ్డి పంచాయతీ పాములరాయి గ్రామస్థులు పోతులయ్యకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని మంగళవారం మహిళలు సామూహికంగా జ్యోతులు, బోనాలతో ఊరేగింపు చేశారు. ఆలయనాకి చేరుకుని పూజలు చేశారు. గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శింగనమల: వర్షాల కోసం వెస్తునరసాపురం గ్రామస్థులు గంగమ్మకు బోనాలు సమర్పంచారు. రైతులు, ప్రజలు విత్తన కార్తె దాటిపోతుండటంతో మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పంచి వర్షాలు బాగా కురవాలని ప్రార్థించారు.

## వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సాయిట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం తపోవనం శివశక్తిసాయి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గోదాదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను అలంకరించడంతోపాటు ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజరావు సమక్షంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రి తదితర ప్రాంతాల్లో అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కనుంపల్లి ఉషారాణి, ఆలయ ధర్మకర్త శ్రీరాములు, దేవేంద్ర, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## బీబీ ఫాతిమా పీరు చివరి దర్శనం



బీబీ ఫాతిమా పీరును చూపుతున్న నిర్వాహకులు

అనంతపురం టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఐదో రోడ్డులో నిర్వహిస్తున్న బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల ముగింపు నేపథ్యంలో మంగళవారం అమ్మవారి పీరు తుది దర్శనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి అమ్మవారి పీరు చివరి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి పెట్టెకు చదివింపులు చేసి, పీర్ల మకానానికి చేర్చారు. బ్రహ్మోత్సవ కమిటీ నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, కేఎస్ మురళీ, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప పాల్గొన్నారు.

## జీలుగ సాగుతో భూసారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గార్లదిన్నె, జూలై 22(ఆంధ్రజ్యోతి): జీలుగ సాగుతో భూసారం పెగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని కొప్పలకొండ గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, జీలుగ పంటలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భూమి సారవంతం అయ్యేందుకు జీలుగ, పిల్లిపెసర ఇనుము, పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తున్నారన్నారు. వాటిని వినియోగించడం ద్వారా భూమి సారవంత అవడంతో పాటు రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. సమాచారం హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ సోమశేఖర్, ఏఈఓ హరి, వీహెచ్ఏ ఆమని, ఎంపీఈఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యూఐ నాయకుడి దిష్టిబొమ్మ దహనం

అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎదుట అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఏబీవీపీ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఒడిస్సా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు ఉదిత్ ప్రధాన్ 19ఏళ్ల విద్యార్థిని కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. అతనిని కఠినంగా శిక్షించాలన్నారు. అభిరామ్, అఖిల్‌కుమార్‌రెడ్డి, గణేష్, అమర్‌శ్రీధర్, శ్రావణి పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పలు కాలనీ వాసులు బీజేపీలోకి చేరారు. నగరంలోని రెండో రోడ్డు, ఐదో రోడ్డులలో లక్కే శంకర్, ఎల్ జయ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేష్ పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పామిశెట్టి నాగరాజు, కార్యదర్శి పోగుల నాగేంద్ర, కోశాధికారి అయ్యన్న, మహిళా మోర్చా కృష్ణవేణి పాల్గొన్నారు.



బీజేపీలోకి చేరిన వారితో నాయకులు

# పరిశ్రమలను ఏర్పాటు చేసి రాప్తాడును అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



హంపాపురంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని హంపాపురం గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. వ్యవసాయ శాఖ తరపున రూ.8 లక్షలు సబ్సిడీతో రైతు సంఘం వారికి డ్రోన్ అందచేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రానున్న నాలుగేళ్లలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. రాప్తాడులో ఏర్పాటు కావాల్సిన జాకీ పరిశ్రమ వైసీపీ నాయకుల కమీషన్ల డిమాండ్‌తో ఇతర ప్రాంతానికి వెళ్లిపోయిందన్నారు. హంపాపురం నుంచి చిగిచెర్ల- ధర్మవరం లింక్ రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరగా త్వరలోనే రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులకు కందులు పంపిణీ చేసి గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇటీవల గ్రామంలోని పక్కీరప్ప, ఉమాదేవి దంపతులు మృతి చెందారు. వారి పెద్ద కుమార్తె ఇంటర్ వరకూ చదువుకుని చెల్లెలు చదువు కోసం కూలీ పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించేది. ఎమ్మెల్యే వారి ఇంటి వద్దకు వెళ్లినప్పుడు కుటుంబ పరిస్థితిని వివరించారు. డిగ్రీ చదువు కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, శ్రీనివాసులు, నారాయణస్వామి, రవి, నంబూరి రమణ, నంబూరి ప్రతాప్, మోదుపల్లి సీతారాముడు, నంబూరి నాగరాజు, ధనలక్ష్మి, యోగి, మధు, వెంకీ, పార్థసారథి పాల్గొన్నారు.

# 100 శాతం పూర్తి చేయడమే లక్ష్యం: ఎమ్మెల్యే దగ్గుపాటి



46వ డివిజన్‌లో పాల్గొన్న టీడీపీ నాయకులు

అనంతపురం క్రైం,జూలై 22(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజవకర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు 100 శాతం పూర్తిచేయడమే లక్ష్యం, ఆదిశగా బూత్ ఇన్‌చార్జిలు కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం పలువురు బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు వంద శాతం తొలి అడుగు కార్యక్రమాన్ని పూర్తి చేయడంతో ఆయన వారిని అభినందించారు. నియోజవకర్గంలోని 4 , 5, 9, 10, 11, 44, 46, 47, 50, 65, 70, 74, 75, 76, 77, 78, 79, 80, 81, 89, 93, 95, 96, 97, 98, 99, 105, 106, 107, 108, 109, 110, 159, 235, 269 బూత్‌లో కార్యక్రమాన్ని బూత్ ఇన్‌చార్జులు, నాయకులు సక్సెస్‌గా చేయడంపై ఎమ్మెల్యే అభినందించారు. 36 బూత్‌లలో 100 శాతం పూర్తి కావడంతో బూత్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులను ఆయన ప్రశంసించారు. మరో 10 రోజులు మాత్రమే సమయం ఉందని, మిగిలిన బూత్‌లలో వంద శాతం చేయడమే ధ్యేయంగా ముందుకెళ్లాలని ఆదేశించారు. నగరంలోని 46వ డివిజన్‌లో తొలిఅడుగు కార్యక్రమం ఘనంగా చేశారు. రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ సరిపూటి రమణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, కార్పొరేటర్ బాలాంజినేయులు, డివిజన్ ఇన్‌చార్జిలు మున్వర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

## ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాం: వీసీ



వీసీని సన్మానిస్తున్న ఎస్కేయూ ఉద్యోగ సంఘాల నాయకులు

అనంతపురంరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్సిటీలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎస్కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అనిత అన్నారు. మంగళవారం వర్సిటీ నాన్‌టీచింగ్, హాస్టల్ ఉద్యోగుల సంఘం, టైం స్కేల్ ఎంప్లాయీస్, మినిమమ్ స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన తరువాత ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు ఇతరాత్రవాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించామన్నారు. నాకు ఎలాంటి బేదాభిప్రాయాలు లేవన్నారు. అందరినీ సమాన దృష్టితో చూస్తూ పాలన సాగిస్తున్నానన్నారు. బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పెంచిన వేతనాలపై అసంతృప్తితో ఆగస్టు 5, 6,7 వతేదీలలో రాజధాని అమరావతిలో దీక్షలు చేపట్టనున్నట్లు సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు 11వ రోజు కొనసాగాయి. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, గోపాల్, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ 124 ద్వారా మున్సిపల్ కార్మికులకు వేతనాలు రూ.3500 పెంచుతున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ వేతనం పెంపు అసంతృప్తిగా ఉందని తెలిపారు. నాయకులు మల్లికార్జున, సంజీవరాయుడు, ఓబుళపతి, మురళీ, పోతులయ్య, తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, శివన్న, పెన్నా, లక్ష్మి పాల్గొన్నారు.

## అనధికార లే అవుట్లపై అహుడా చర్యలు



అనధికార లేఔట్లలో రాళ్లు తొలగిస్తున్న అహుడా అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్లపై అహుడా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్లపై చైర్మన్ టీసీ వరుణ్, వైస్ చైర్మన్ శివ నారాయణశర్మ ఆదేశాల మేరకు మంగళవారం గోవిందంపల్లి, వడియంపేట గ్రామ పంచాయతీల పరిధిలో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జేపీఓ హరీష్‌చౌదరి, ప్లానింగ్ సెక్రటరీలు, సంబంధిత ఆయా గ్రామ కార్యదర్శులతో కలిసి తనిఖీలు చేశారు. గోవిందపల్లి గ్రామంలో సర్వే నంబర్లు 78, 145, 165లలో అదే విధంగా వడియంపేట గ్రామ పంచాయతీ పొడరాళ్ల గ్రామంలో సర్వే నంబర్లు 295, 279, 84, 85, 87లలో అనధికారికంగా వేసిన లేఔట్లలో రాళ్లను తొలగించారు.

## ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు టీడీపీ నాయకుడు మారినేని నారాయణస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని కురుగుంట గ్రామం సేవాలాల్ కాలనీలో గుడి నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులకు ఆ సొమ్మును అందించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే స్థానికులు ఆలయనిర్మాణం సాయం చేయాలని కోరారని, ఇచ్చిన హామీ మేరకు విరాళం అందించారన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు ధర్మేంద్ర, స్టోర్ రంగా యాదవ్, రంజిత్‌నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల కమిటీ ఎంపిక

అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గ రేషన్ డీలర్ల నూతన కమిటీని మంగళవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బోయశ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రాము ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా గోళ్ల సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా దలవాయి వెంకటేష్, కార్యదర్శిగా జయప్రకాష్‌బాలా, సంయుక్త కార్యదర్శిగా ఎద్దుల రాజేష్‌లను ఎంపిక చేశారు కమిటీ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బిల్లు ప్రవేశపెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ బిల్లు ప్రవేశపెట్టాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. మంగళవారం స్థానిక ఎన్జీఓహోంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల తరహాలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కేంద్రం ప్రవేశపెట్టాలన్నారు. లక్ష్యాలను సాధించడానికి సబ్‌ప్లాన్ చట్టం నిబంధనల మేరకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశం తప్పనిసరి చేయాలన్నారు. సంఘం సభ్యుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

## వసతి గృహంలో బోరు ఏర్పాటు

శింగనమల, జూలై 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహానికి తాగునీటి బోరును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఏర్పాటు చేయించారు. మండల అధికారులతో ఇటీవల ఎమ్మెల్యే సమావేశం నిర్వహించగా స్థానిక నాయకులు వసతి గృహంలో బోరు ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బోరును వేయించారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అనంతపురం రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ సంతోష్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు సర్పంచు శివశంకర్ తెలిపారు. కాలనీలో మంగళవారం జలజీవన్ మిషన్ పథకం కింద జరుగుతున్న కాలువతీత, పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో పైపులైన్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే పీఏబీఆర్ నీటిని గ్రామానికి సరఫరా అవుతాయన్నారు. పంచాయతీ కార్యదర్శి చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఆత్మకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రిటైర్డు ప్రిన్సిపాల్ భవానీప్రసాద్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. తాను చదివిన పాఠశాలలో కొంతవరుకు విద్యార్థులను ప్రోత్సహించాలని ప్రతి సంవత్సరం నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నానన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ బొమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించండి



డ్వామా పీడీకి వినతి పత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కార్మికులకు 10 వారాలకు సంబంధించిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డ్వామా పీడీ సలీం బాషాను కోరారు. మంగళవారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి భాస్కర్ పీడీకి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఉపాధి పనులు అడిగిన వారందరికీ కల్పించేలా చూడాలన్నారు. పనిచేసే ప్రాంతంలోనే మస్టర్ వేసి, కొలతలు తీసిన తర్వాత కూలీల పేర్లుచదివి వినిపించడంతోపాటు ప్లేస్లిప్‌లు ఇవ్వాలన్నారు. నాయకులు వెంకటచలపతి, నాగ లింగయ్య పాల్గొన్నారు.

నార్పల: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల బిల్లులను చెల్లించాలని ఎంపీడీఓకు మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ నెలలు గడుస్తున్నా కూలీలకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సాకే గంగాధర, పెద్దపెద్దయ్య, శివారెడ్డి, శివ, నారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.

# ఉన్నతాధికారిని దుర్భాషలాడటం సరికాదు

● ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓల సంఘం నాయకులు

అనంతపురంరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి దుర్భాషలాడటం సరికాదని ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓల సంఘం నాయకులు అన్నారు. ఆమేరకు మంగళవారం సాయంత్రం ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ్ శర్మను కలసి వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీ అధికారిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను అసోసియేషన్లు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

**జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరు సరికాదు..**

అనంతపురం క్లాక్‌టవర్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరును ఆల్ ఇండియా వాల్మీకి గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. మంగళవారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరహరి, బాలమురళీకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రభుత్వ అధికారిపై జేసీ ప్రభాకర్ రెడ్డి దురుసు ప్రవర్తన హేయమైన చర్య అన్నారు. వెంటనే జేసీ ప్రభాకర్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కుతీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓల సంఘం నాయకులు



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

## ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధ్యానమిస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం రేగడికొత్తూరు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. ఎంపీపీ సునీత, పసుపుల శ్రీరామిరెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, ఓబులపతి పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



కమిషనర్ బాలస్వామికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచినందుకు సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. 15రోజులుగా సమ్మె చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచుతూ జీఓ నంబరు 124 విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రికి, మంత్రి నారాయణ, మున్సిపల్ డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.

## అచ్యుతానందన్ జీవితం స్ఫూర్తిదాయకం



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

అనంతపురం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ జీవితం ప్రజా పోరాటాలకు స్ఫూర్తిదాయకం అని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప అన్నారు. అచ్యుతానందన్ మృతికి సంతాపంగా సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక క్లాక్‌టవర్ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కేరళ రాజకీయ చరిత్రలో అచ్యుతానందన్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజల పక్షాన నిలిచి, ప్రజల హృదయాల్లో ఉన్న నేతల్లో ఒకడిగా ఆయన తన జీవితాన్ని కొనసాగించారని కొనియాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, కృష్ణమూర్తి, బాలరంగయ్య, రామిరెడ్డి, కేశవరెడ్డి, రమణయ్య, నాగమణి, భాస్కర్, వెంకటనారాయణ, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి టీడీపీ అండ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త బండారు కుళ్లాయప్ప కుటుంబాన్ని అన్నివిధాలుగా పార్టీ ఆదుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం అనంతపురం సర్వజన అస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

## గ్రంథాలయశాఖ సీనియర్ అసిస్టెంట్ మృతి



శివశంకర ప్రసాద్ (ఫైల్)

అనంతపురం విద్య, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొమ్మా శివశంకరప్రసాద్(60) మంగళవారం మృతిచెందారు. గతకొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వస్తున్నారు. మంగళవారం తెల్లవారజామున ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. శివశంకర్ కొన్ని దశాబ్దాలుగా గ్రంతాలయశాఖలో పనిచేస్తూనే ఉద్యోగ సంఘ నేతగా కొనసాగు తూ వచ్చారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతి పట్ల గ్రంథాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో సెక్రటరీ రమాతో పాటు కమ్మన్న, రవికుమార్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, గోవిందు, భాస్కర్, శ్రీపతి ఆయన మృతికి సంతాపం తెలిపారు.

## కేసు నమోదు

రామగిరి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సైబర్ మోసాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో పేరూరుకు చెందిన గొల్ల గంగయ్య అనే వ్యక్తి ఎస్‌బీఐ కంబదూరు బ్రాంచ్‌లో ఉన్న తన ఖాతా నుంచి అనుమానాస్పదంగా పెద్ద మొత్తంలో డెబిట్ అయినట్టు ఫిర్యాదు చేశారు. 19, 20వ తేదీల మధ్య జరిగిన నాలుగు లావాదేవీల ద్వారా మొత్తం రూ.66వేలు నగదు తీసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## రెండు గేదెలను ఎత్తుకెళ్లిన దుండగులు

బుక్కరాయసముద్రం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకే అగ్రహారం గ్రామంలో రైతులు భాస్కర్‌రెడ్డి, ఓబిరెడ్డిలకు చెందిన రెండు ఎనుములను గుర్తు తెలియని దుండగలు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరుకు సంజీవపురం గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి, ఓబిరెడ్డిలకు చెందిన రూ.3లక్షల విలువైన ఎనుములను గుర్తు తెలియని దుండగలు సోమవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారన్నారు. రెండు నెలలు క్రితం భీమిరెడ్డి అనే రైతు ఎనుము ఎత్తుకెళ్లారన్నారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

## తండ్రి చెంతకు యువకుడు



యువకుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ

అనంతపురం క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన విభిన్న ప్రతిభావంతుడైన యువకుడిని త్రీటౌన్ పోలీసులు వెతికి మంగళవారం తండ్రి చెంతకు చేర్చారు. సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండ లం బుడిమేపల్లికి చెందిన శ్రీరాములు తన విభిన్న ప్రతిభావంతుడైన కుమారుడు భరత్(18)తో కలసి హైదరాబాద్ నుంచి వచ్చి ఉదయం అనంతపురం బస్టాండ్‌లో దిగాడు. ఊరికి వెళ్లేందుకు కళ్యాణదుర్గం బస్సు కోసం వేచి ఉండమని చెప్పి, ఆయన వాష్‌రూమ్‌కు వెళ్లాడు. వచ్చి చూసే సరికి భరత్ కనిపించలేదు. బాధితుడి తండ్రి త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా నగరంలోని పలు ప్రాంతాల్లో గాలించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా, బద్వేల్ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద బస్సును ఆపించి భరత్‌ను దింపి, అనంతపురం రప్పించారు. అనంతరం యువకుడిని తండ్రి శ్రీరాములుకు అప్పగించారు.

# నిర్మించారు.. వదిలేశారు.!

● మంజూరు కాని బిల్లులు
● నిరుపయోగంగా పలు భవనాలు



నిరుపయోగంగా ఉన్న ఆమిద్యాలలో సచివాలయం, చిన్నముష్టూరులో ఆయుష్మాన్ భారత్ కేంద్రం, మోపిడిలో రైతు సేవా కేంద్రం భవనాలు

ఉరవకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆమిద్యాలలో సచివాలయం, మోపిడిలో రైతు సేవా కేంద్రం, చిన్నముష్టూరులో ఆయుష్మాన్ భారత్ కేంద్రానికి భవనాలను మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణాలను సుమారు 20 నెలల క్రితమే ఆయా కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. అయితే ఆ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఆ భవనాలను వారు అధికారులకు అప్పగించలేదు. దీంతో ప్రజా ధనం వృథా కావడంతో పాటు ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఆకతాయిలు ఆ భవనాల తలుపులు, కిటికీలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా ఈ భవనాలు పలు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారాయి. దీంతో చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ భవనాలు వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధికి తలారి రంగయ్య అడ్డు

**ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ధ్వజం**



సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్య కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి అడ్డు కట్ట వేస్తున్నాడని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని 15 వ వార్డు, 16 వ వార్డు వాల్మీకి సర్కిల్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా ఆయన అడ్డుపడుతున్నారన్నారు. అభివృద్ధికి వైసీపీ కౌన్సిలర్లు ఏ మాత్రం సహకరించడం లేదని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ కూడా ఫోన్ చేసినా అందుబాటులో ఉండడం లేదని, అందు కోసమే అతని ఆచూకీని కనిపెట్టాలని పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం మున్సిపాలిటిలో అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి సహకరించాల్సింది పోయి, అడ్డుకట్ట వేస్తూ కుట్ర రాజకీయాలకు పాల్పడడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ఈ పరిణామాలను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● టీడీపీ నాయకుడికి నివాళి

కంబదూరు మండలం వైసీ పల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఉన్నం అంజినప్ప అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే అమిలినేని నివాళులు అర్పించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, చిత్రదుర్గం గోపి, కరణం మల్లికార్జున బాబు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి తదితరులు ఉన్నారు.



రాయదుర్గంలో విప్ కాలవ, గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రచారం

# టీడీపీతోనే అన్ని వర్గాలకూ సమన్యాయం: విప్

రాయదుర్గం, జూలై 22(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అన్ని వర్గాలకూ సమన్యాయం సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో 28, 29 వార్డుల్లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరించారు.

● గుంతకల్లు : పట్టణంలోని 29, 30 వార్డుల్లో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ఒక్క చంద్రబాబు వల్లే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, ఫజులు, రామన్న చౌదరి, గుడిపాటి ఆంజనేయులు, అంజి, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎంపీటీసీ సభ్యుల ఆందోళన



నిరసన తెలుపుతున్న సభ్యులు

ఉరవకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలంటూ ఎంపీటీసీ సభ్యులు మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండల సభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే వైసీపీ ఎంపీటీసీలు సర్పంచులు సమస్యలపై సమావేశలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాడు నేడు పనులు పూర్తి చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలని, అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలని కోరారు. ప్రతి సమావేశంలోనూ మండల ప్రగతి నివేదిక కాపీలు ఇవ్వాలని అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, ఎంపీడీఓ రవి ప్రసాద్, తహసీల్దారు మహబూబ్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సబ్ జైలు తనిఖీ

గుత్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాజశేఖర్, మండల లీగల్‌సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జిల్లా న్యాయాధికారి సాధుబాబు మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించారు. వారి వెంట జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, ప్యానల్ న్యాయవాది గంగాధర్ కుమార్ ఉన్నారు.

### నేడు ద్విచక్ర వాహనాల వేలం

డీ.హీరేహాళ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో సీజ్ చేసిన 13 ద్విచక్ర వాహనాలను రాయదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వేలం వేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా రూ. రెండు వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

### మిడ్ పెన్నార్ డ్యాంకు నీటి విడుదల

ఉరవకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడి వద్ద ఉన్న మిడ్ పెన్నార్ కాలువ షెట్టర్లను ఎత్తి తుంగభద్ర జలాలను అధికారులు విడుదల చేశారు. కణేకల్లు చెరువు నుంచి మంగళవారం నింబగల్లు హెడ్ రెగ్యులేటర్‌కు తుంగభద్ర జలాలు చేరుకోగా.. అక్కడి నుంచి ఎంపీఆర్ డ్యాంకు అధికారులు మళ్లించారు. జిల్లా సరిహద్దు వద్ద 900 క్యూసెక్కులకు పైగా నీరు వస్తోందని, అందులో 470 క్యూసెక్కులను కణేకల్లు చెరువు నుంచి ఎంపీఆర్ డ్యాంకు వదులుతున్నట్లు తెలిపారు. పీఏబీఆర్ రెగ్యులేటర్ పనులు జరుగుతున్నందున హెచ్చెల్సీకి వస్తున్న నీటిని అంతా ఎంపీఆర్‌కు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

### అస్తికల భస్మం కాశీకి ..

తాడిపత్రి, జూలై22(ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ శ్మశాన వాటికలో అస్తికలను దహనం చేయగా వచ్చిన భస్మాన్ని మంగళవారం ప్రత్యేక వాహనంలో కాశీకి తరలించారు. హిందూ శ్మశాన వాటిక రూపురేఖలు మార్చేందుకు గాను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హిందువుల ఏకాభిప్రాయం మేరకు గతంలో రుద్రభూమిలో ఉన్న సమాధులను సమతలం చేసి వచ్చిన అస్తికలను భస్మం చేసిన విషయం తెల్సిందే.

## పామిడి ఆర్టిస్ట్‌కు అరుదైన గౌరవం

**ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీకి చీఫ్ జడ్జిగా ఎంపిక**



గంప మల్లయ్య

పామిడి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొరకాయలపేట గ్రామానికి చెందిన నేసే తాతయ్య కుమారుడు బీరీ గంపమల్లయ్యకు అరుదైన గౌరవం దక్కింది. విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో ఈనెల 27న హ్యూమానిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీలో చీఫ్ జడ్జ్‌గా అతన్ని ఎంపిక చేస్తూ ఆ ఫౌండేషన్ మంగళవారం ట్వీట్ చేసింది. గంపమల్లయ్య కడపలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నాడు. చిన్నతనం నుంచే అనేక జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో పాల్గొని పురస్కారాలు సాధించాడు.

### కార్మికుల సమ్మె విరమణ

తాడిపత్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు పట్టణంలో పదిరోజులుగా చేపట్టిన సమ్మెను మంగళవారంతో విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఓ నెంబరు 36ప్రకారం రూ.24,500 వేతనం కావాలని అడిగితే ప్రభుత్వం కేటగిరీల వారీగా విభజించి వేతనాలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమాగౌడ్, యూనియన్ నాయకులు శ్రీరాములు, జుబేర్, మహబూబ్‌బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

### పోలీసులకు వైద్య పరీక్షలు

తాడిపత్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలోని అన్నిస్టేషన్ల అధికారులు, సిబ్బందికి అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వారికి అవసరమైన మందులను కూడా పంపిణీ చేశామన్నారు.

### పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

బెళుగుప్ప, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేకుంట ఉన్నత పాఠశాలకు ఓ దాత రూ. ఎనిమిది లక్షలు విలువ చేసే 20 కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను మంగళవారం అందజేశారు. దీంతో ఆ పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు ఆ దాతను అభినందించారు.

### రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

యాడికి, జూలై 22(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు ఆధ్వర్యంలో గురువారం రాయలచెరువులోని లయన్స్‌క్లబ్ కార్యాలయం వద ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మూడుపాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు.

### ఆసుపత్రికి సీసీ రోడ్డు ఏర్పాటు చేయండి

విడపనకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజినేయులుఎంపీడీఓ షకీలా బేగంకు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. దాదాపుగా 20 ఏళ్ల నుంచి ఈ ఆరోగ్య కేంద్రానికి దారి లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సోమవారం మధ్యాహ్నం కొంతమంది గర్భవతులతో వెళ్తున్న ఆటో ఆసుపత్రి దారిలోని గుంతల్లో బోల్తా పడిందన్నారు. మండల అధికారులు స్పందించి ఆసుపత్రికి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు.

### కసాపురం ఆలయంలో హోమం

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. రాత్రి వర్షం కారణంగా స్వామి వారి ప్రాకారోత్సవాన్ని నిర్వహించలేదు.

## న్యూస్ బాక్స్



కోట వీధిలో బోనాలతో ఊరేగింపు

### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు



గుత్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో వెలసిన రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గంగా పూజ, ఉత్సవ విగ్రహానికి పల్లకి సేవ, ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోట ముఖద్వారం నుంచి బోనాల ఉత్సవాలను ముత్తైదువులు తమ ఇళ్ల నుంచి చలవతో కూడిన పదార్థాలను బోనాలుగా అమ్మవారికి ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అంతర పంటల సాగుతో ఆదాయం

రాయదుర్గంరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటలో అంతర పంటలుగా కంది, ఆముదం, ఉలవ తప్పకుండా సాగు చేయాలని, తద్వారా చీడపీడలు ఆశించడం, పెట్టుబడి తగ్గి, ఆదాయం పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైలజకుమారి సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలో పైతోట గ్రామంలో వ్యవసాయాధికారి అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో ఆమె రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మనోజ్, ఎంపీఈఓ షామిలి పాల్గొన్నారు.

### వేపనూనెతో ఆకు పచ్చపురుగు నివారణ

విడపనకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కంది పంటకు ఆశించే ఆకు పచ్చపురుగును వేప నూనెను వాడి నివారించవచ్చని ఏఓ పెన్నయ్య సూచించారు. మంగళవారం మండలంలోని మాళాపురం, విడపనకల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆకులు తినే పచ్చపురుగును మొదటిలోనే నివారించాలని, ఐదు ఎంఎల్‌ల వేప నూనెకు, ఒక లీటర్ నీటిని కలిపి మొక్కలపై పిచికారి చేయాలని అన్నారు. వేప నూనె వాడకం వల్ల మొక్కలు ఎదుగుదల కూడా అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కైలాష్, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

### ధర్నాను విజయవంతం చేయండి

రాయదుర్గం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు అంశాలపై సీపీఐ ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అదే విధంగా 12, 13 తేదీల్లో అనంతపురంలో జరిగే మహాప్రదర్శనతో పాటు జిల్లా మహాసభల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పామిడి, జూన్ 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఏపీటీఎఫ్ మండల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూర్ మొహమ్మద్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సతీష్‌కుమార్, మల్లికార్జున, సింహన్న, వివేకానంద, జిలాన్, కృష్ణమూర్తి, నాగార్జున పాల్గొన్నారు.

### నిరుపేదలను దత్తత తీసుకోండి

కణేకల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదలను దత్తత తీసుకునేందుకు ఆయా గ్రామాల్లోని ప్రజలు ముందుకు రావాలని ఎంపీడీఓ విజయ సింహారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక రెండవ సచివాలయం వద్ద బంగారు కుటుంబం గురించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన పథకాలు ఇప్పటివరకు పొందనివారు పేదవారిగా గుర్తించడం జరిగిందని, అటువంటి వారెవరైనా ఉంటే వారిని దత్తత తీసుకుని వారి అభివృద్ధికి కృషి చేసేవారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ ప్రసాద్, సర్పంచ్ నిర్మల, టీడీపీ నాయకులు ఆనంద్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, మాబుసాబ్, ఈరప్ప, మహ్మద్ పాల్గొన్నారు.

### కృష్ణా జలాలకు హారతి



కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న అర్చకులు

వజ్రకరూరు(ఉరవకొండ), జూలై 22(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చాయాపురం వద్ద కృష్ణా జలాలకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పూజలు చేశారు. ఈ నెల 17వ తేదీన సీఎం చంద్రబాబు మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు నీటిని విడుదల చేశారు. జిల్లా సరిహద్దుకు మంగళవారం మధ్యాహ్నం కృష్ణా జలాలు చేరాయి. దీంతో 165కి.మీ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ చీఫ్ ఇంజనీర్ నాగరాజు, ఎస్ఈ రాజాస్వరూప్, కృష్ణాజలాలకు పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. ప్రస్తుతం 1000క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ శ్రీనివాస్, డీఈ రమణ, ఏఈలు సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### డీఎస్పీ కార్యాలయం చుట్టూ భారీ భద్రత

తాడిపత్రి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేస్తానని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చెప్పడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సబ్‌డివిజన్‌పరిధిలోని అధికారులందరూ డీఎస్పీ కార్యాలయం చుట్టూ పహారా కాశారు. అయితే జేసీ ప్రభాకర్‌రెడ్డి రావడం లేదని తెలుసుకున్న పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

### ముచ్చర్లపల్లికి బస్సు సౌకర్యం

శెట్టూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చర్లపల్లికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వారం క్రితం కనుకూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి ఈ సమస్యను ఆ గ్రామస్థులు తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. మంగళవారం నుంచి ఆ గ్రామానికి బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. దీనిపై ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



బస్సు వద్ద ముచ్చర్లపల్లి గ్రామస్థుల హర్షం

## క్రైం న్యూస్ ..

### చోరీ కేసును ఛేదించిన పోలీసులు

గుంతకల్లుటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ షాపులో ఆదివారం రాత్రి జరిగిన చోరీని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం ఛేదించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న షేక్ నబీ రసూల్ బళ్లారి రోడ్డులో ఎండీజీ ఇంజనీరింగ్ వర్క్స్ అండ్ వెల్డింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి నబీ రసూల్ పనులు ముగించుకొని షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం వచ్చి చూడగా... దుండగులు షాపు తాళాలు పగలగొట్టి.. రూ.1.80 లక్షల విలువ చేసే ఆటో మొబైల్ సామాన్లు దొంగలించినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో .. వారు ఆ షాపులో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఉమామహేశ్వర్ నగర్‌కు చెందిన పాత నేరస్తుడు దూదేకు ఇమామ్ ఈ దొంగతనం చేసినట్లు గుర్తించారు. మంగళవారం బళ్లారి రోడ్డులోని కల్వరి టెంపుల్ వద్ద ఉన్న అతన్ని సీఐ మనోహర్, ఎస్ఐ కొండయ్య తన సిబ్బందితో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఆ ఆటో మొబైల్ సామన్లు స్వాధీనం చేసుకున్నారు.

### కంప్యూటర్ చోరీ

గుత్తిరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఊబిచెర్ల విలేజ్ క్లినిక్ హెల్త్ సెంటర్‌లోని కంప్యూటర్, కుర్చీలను సోమవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. ఆ సెంటర్‌కు ఉన్న తలుపులు పగలగొట్టి వాటిని ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం దీన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమచారం అందించారు. పోలీసులు ఆ సెంటర్‌ను పరిశీలించారు.

### మూడు దుకాణాల్లో ...

గుత్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమృత్ థియేటర్ కాంప్లెక్స్‌లో మంగళవారం తెల్లవారుజామున మూడు దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వస్త్ర దుకాణంలో నగదును అపహరించారు. శ్రీకాంత్ మొబైల్ షాపుతో పాటు మరో దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

### చిరుత దాడిలో గొర్రె మృతి

బెళుగుప్ప, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి తండాలో సోమవారం రాత్రి తిప్పేస్వామి నాయక్‌కు చెందిన గొర్రెల మందపై ఓ చిరుత దాడి చేసి.. ఓ గొర్రెను చంపింది. దీంతో తనకు 15 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

### తండ్రి చెంతకు యువకుడు



సీఐతో భరత్, శ్రీరాములు

అనంతపురం క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన విభిన్న ప్రతిభావంతుడిని త్రీటౌన్ పోలీసులు మంగళవారం తండ్రి చెంతకు చేర్చారు. బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన శ్రీరాములు తన కొడుకు భరత్ (18)తో కలసి హైదరాబాద్ నుంచి వచ్చి మంగళవారం ఉదయం అనంతపురం బస్టాండ్‌లో దిగాడు. ఊరికి వెళ్లేందుకు కళ్యాణదుర్గం బస్సు కోసం వేచి ఉండమని చెప్పి, ఆయన వాష్‌రూమ్‌కు వెళ్లాడు. వచ్చి చూసే సరికి భరత్ కనిపించలేదు. దీంతో శ్రీరాములు త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ శాంతిలాల్ సీసీ కెమెరాలు పరిశీలించగా, భరత్ బద్వేల్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. వెంటనే బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద ఆ బస్సును ఆపించి భరత్‌ను దింపి, అనంతపురం రప్పించాడు. అతన్ని శ్రీరాములుకు క్షేమంగా అప్పగించాడు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పామిడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాదర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంబాబు, పీడీ శిరీష మంగళవారం తెలిపారు. ఆర్ ప్రణయ, జీ భవాణి, ఎల్ సుచిత్ర, ఎల్ మానస రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

● తెనగల్లు పాఠశాల విద్యార్థులు...



కుందుర్పి : రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని తెనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. తొమ్మిద తరగతి విద్యార్థి శివాజీ, పదో తరగతి విద్యార్థి రామ్ చరణ్ సబ్ జూనియర్స్ విభాగంలో ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం దస్తగిరి, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్ తెలిపారు. ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు చెప్పారు.

## ఆసుపత్రికి అనాథ వృద్ధురాలి తరలింపు



వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ, కానిస్టేబుల్

పామిడి, జూలై 22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కొన ఊపిరితో రోడ్డు పక్కన అచేతనంగా పడి ఉన్న భిక్షటన చేసే ఓ అనాథ వృద్ధురాలిని సీఐ యుగంధర్ ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామానికి వెళ్లిన సీఐ 44వ జాతీయ రహదారి పక్కన చలనం లేకుండా పడి ఉన్న గుర్తు తెలియని భిక్షటన చేసే ఓ వృద్ధురాలిని గమనించాడు. కొన ఊపిరితో ఉండటంతో ఆమెను కానిస్టేబుల్ రవీంద్ర సాయంతో ఆటోలో తీసుకువెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. జాగ్రత్తగా వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

### హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపప్పూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి, చక్రస్థాపన భీమలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని అధికారులు మంగళవారం లెక్కించారు. 2025 మార్చి నుంచి జూలై మాసం వరకు రూ.5,73,846 ఆదాయం వచ్చినట్లు ఈఓ సుబ్రమణ్యాం తెలిపారు.